ప్రయాణికులకు నో షెల్టర్

- ఆనందపురం, వేములవలస కూడళ్లలో నిలువ నీడ లేక ఇబ్బందులు
- హైవే నిర్మాణం తర్వాత షెల్టర్లు పునరుద్ధరించని అధికారులు


షెల్టర్ లేని వేములవలస కూడలి


విశాఖ నుంచి విజయనగరం వెళ్లే ప్రయాణికులకు ఫ్లై ఓవర్ కింద భాగమే షెల్టర్


ప్రయాణికులకు షెల్టర్ లేని ఆనందపురం ఫ్లై ఓవర్ సమీపంలోని కూడలి

తగరపువలస : బస్సులు, ఇతర వాహనాల కోసం నిరీక్షించే ప్రయాణికులకు నిలువ నీడ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం జాతీయ రహదారుల విస్తరణ సమయంలో తగరపువలసకు ప్రాధాన్యత తగ్గించిన హైవే అధికారులు ఆనందపురానికి పెద్దపీట వేశారు. ఈ కూడలి వద్ద విశాఖ, అనకాపల్లి పట్టణాల వైపు వెళ్లే వాహనాలకు ప్రాధాన్యత కల్పించి ఫ్లై ఓవర్ల మీదుగా జాతీయ రహదారులు ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి తగరపువలస మీదుగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పైనుంచి రాకపోకలు సాగించేందుకు ఆనందపురం కూడలిలో విశాలమైన సర్కిల్ ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా జాతీయ రహదారుల విస్తరణకు ముందు ఈ కూడలిలో ఉన్న బస్ షెల్టర్లు తిరిగి పునరుద్ధరించలేదు. దీంతో ప్రస్తుతం ఆనందపురం కేంద్రంగా ఉన్న ఐదు మార్గాల్లో ప్రయాణికులకు ఒక్కటి కూడా షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బస్సులు, ఇతర ప్రయాణ వాహనాల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఈ ఐదు మార్గాలు నిత్యం విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగస్తులతో రద్దీగా ఉంటాయి. తగరపువలస మీదుగా వచ్చే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లిపోతుంటే సిటీ సర్వీస్‌లు వేములవలస కూడలి నుంచి వెళ్తుంటాయి. పెందుర్తి, అనకాపల్లితోపాటు విశాఖ నుంచి తగరపువలస మీదుగా రాకపోకలు సాగించే బస్సులు ఫ్లై ఓవర్ల కింద, సర్వీస్ రోడ్లపై నిలుపుతుంటారు. ఇక్కడ మూడు చోట్లా ప్రయాణికులకు షెల్టర్లు లేవు.

ప్రయాణికుల కష్టాలు పట్టవా?

ఫ్లై ఓవర్, వేములవలస కూడళ్లలో ఎలాంటి ఆధారం లేకుండానే ప్రయాణికులు, విద్యార్థులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రవాణా సాధనాల కోసం గంటల కొద్దీ వేచి చూస్తుంటారు. ఇక ఫ్లై ఓవర్ల కింద వాటి నీడే ప్రయాణికులకు కొంత ఉపశమనం కలిగిస్తుండగా భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులకు అనుక్షణం ఒక గండంలా గడుస్తోంది. అందువల్ల ప్రయాణికుల రక్షణకు ప్రాధాన్యత కల్పిస్తూ బస్ షెల్టర్ల నిర్మాణానికి నేషనల్ హైవే, ఆర్టీసీ యాజమాన్యం కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కూడళ్లలో వాహనాల బెడద ఎక్కువ



ఆనందపురం, వేములవలస కూడళ్లలో రవాణా వాహనాల కోసం రోడ్లపైనే వేచి ఉండాల్సి వస్తోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో భయం భయంగా ఉంటోంది. ఎండా, వానలతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ కూడళ్లలో అధునాతన బస్ షెల్టర్లు నిర్మించాలి.

– బండారు ఎల్లాజీరావు, ప్రయాణికుడు

ప్రయాణికులకు ప్రాధాన్యమివ్వాలి



బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు నీడ, తాగునీరు అందుబాటులో లేవు. సమాచారం ఇచ్చే నాథుడు ఆనందపురం కూడలిలో కనిపించరు. ప్రయాణికులకు ప్రాధాన్యత కల్పిస్తూ ఈ ప్రాంతంలో బస్ కాంప్లెక్స్ లేదా షెల్టర్, సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలి.

– కొంకిపూడి శంకర్, ప్రయాణికుడు

రోడ్లపైనే ఎదురుచూపులు



ఏదైనా పనిమీద ఆనందపురం వెళ్లినప్పుడు తిరిగి రావడానికి బస్సులు, ఆటోల కోసం రోడ్లపైనే ఎదురు చూడాల్సి వస్తోంది. కొన్నిసార్లు అనకాపల్లి, పెందుర్తి వైపు బస్సుల కోసం గంటకు పైగా ఎదురు చూస్తుంటాం. షెల్టర్లు ఏర్పాటు చేస్తే వేచి ఉండటానికి వీలుగా ఉంటుంది.

– ఎరుసు తోటయ్య, ప్రయాణికుడు

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


చిట్టివలసలో ప్రచారం చేస్తున్న విజయరాంపురం కమిటీ ప్రతినిధులు

తగరపువలస : ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టివలసలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి ప్రతి ఒక్కరూ గురుపూజ చేయాలన్నారు. ప్రచార కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.రాజు, కె.బంగారునాయుడు, బి.మల్లేష్, శేఖర్, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో చెత్త తొలగింపు


బీచ్‌లో చెత్త తొలగిస్తున్న పొక్లెయిన్

భీమునిపట్నం : భీమిలి జోనల్ కార్యాలయం ఎదురుగా బీచ్‌లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను పొక్లెయిన్‌తో ఆదివారం తొలిగించారు. కొద్ది నెలలుగా జోనల్ కార్యాలయం ఆధునికీకరణ పనులు జరుగుతుండగా అందుకు సంబంధించిన చెత్త, ఇతర వ్యర్థాలను ఎదురుగా బీచ్‌లో పడేయడంతో అక్కడ పేరుకుపోయింది. మత్స్యకారులు ఇక్కడ పడవలను నిలిపి ఉంచడంతోపాటు, పర్యాటకులు కూడా వస్తుండడంతో ఇబ్బందికంగా మారింది. దీంతో చెత్తను పొక్లెయిన్ సాయంతో తొలగించారు. చుట్టుపక్కల పెరిగిపోయిన పిచ్చి మొక్కలు కూడా తొలగిస్తున్నారు. కొద్ది రోజుల్లో ఈ ప్రాంతం పరిశుభ్రంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు.

సంగివలసలో ఎగ్జిబిషన్ ఏర్పాటు


ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వస్తువులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయానికి ఎదురుగా నగరానికి చెందిన నిర్వాహకులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులు, మహిళలకు చెందిన వివిధ ఆకర్షణీయమైన వస్తువులు ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్ రోజూ సాయంత్రం వేళల్లో తెరవనున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ముగ్గురు యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ ముగ్గురు యువకుల ప్రాణాలు కాపాడారు. నగరంలోని ఓ కళాశాలలో చదువుతున్న వి.ఈశ్వరరావు, రామ్మోహన్, భరత్ ఆదివారం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. కాసేపు సరదాగా గడిపి బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల ముగ్గురు యువకులు కొట్టుకుని పోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. అయితే వీరిలో ఇద్దరు సురక్షితంగా బయటపడినప్పటికీ... ఈశ్వరరావు పరిస్థితి విషమంగా ఉందని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు మెరైన్ పోలీసులు తెలిపారు.

గోతుల రోడ్డుతో అవస్థలు


పద్మనాభం సచివాలయం సమీపంలో గోతులు పడిన రోడ్డు

పద్మనాభం : పద్మనాభం సచివాలయం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయమైంది. దీంతో ప్రయాణికులు ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై విజయనగరం, సింహాచలం, తగరపువలస, భీమునిపట్నం ప్రాంతాలకు బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. విజయనగరం – సింహాచలానికి ఇది ప్రధాన రోడ్డు కావడంతో వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై గోతులు పడి పిక్కలు తేలిపోయాయి. వర్షాలకు గోతులు నీటితో నిండిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


శిల్పారామంలో నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. నగరంలోని కిరణ్మయి నృత్యాలయంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుత నృత్యాభినయంతో ఆకట్టుకున్నారు. కళాకారులు శావాన్యతి, లహరి, సాయిప్రియ, తనుశ్రీ, తపశ్వి, అలేఖ్య, మన్విత, భూమి, దీక్షిత, నవ్యశ్రీ, మనన్య, నందన నృత్యం చేయగా... కిరణ్మయి నృత్య దర్శకత్వం వహించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి సమీపంలోని ఇటుక బట్టీలు వద్ద ఆదివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.12,750 నగదు, ఆరు ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుట్టుగా పేకాట శిబిరాల నిర్వహణ

తగరపువలస : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో రోజూ యథేచ్ఛగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో బంగ్లామెట్ట కేంద్రంగా మూడు ఇళ్లల్లో రోజూ రొటేషన్ పద్ధతిలో పేకాట శిబిరాలు గుట్టుగా నిర్వహిస్తున్నట్టు సమాచారం. అలాగే మండల పరిధిలోని మహరాజుపేట – పద్మనాభం మార్గంలో తాటితూరు కూడలి నుంచి శింగనబంద పంచాయతీలోని కృష్ణంరాజుపేట వరకు చెరువు గట్లు, వ్యవసాయ భూములు, తుప్పల మాటున రోజూ క్రమం తప్పకుండా పేకాట నిర్వహిస్తున్నట్టు స్థానికులు తెలియజేస్తున్నారు. ఈ శిబిరాల్లో విశాఖ నగరం నుంచి శ్రీకాకుళం వరకు ఆటగాళ్లు వచ్చి పాల్గొంటున్నారు. భోగాపురం మండలం లింగాలవలస, భీమిలి మండలంలోని మూలకుద్దు, జీవీఎంసీ పరిధిలో చిల్లపేట, సంతపేటకు చెందిన వ్యక్తులు ఈ పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్టు గట్టిగా వినిపిస్తోంది. శిబిరాల వద్ద పరదాలు వేయడం నుంచి ఆటగాళ్లకు ఆహార పదార్థాల సరఫరా వరకు అంతా తామై చూసుకుంటున్నారు. ఈ పేకాట శిబిరాల్లో స్థానికులు ఎక్కువ మంది పాల్గొని ఇళ్లు గుల్ల చేస్తున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ జూదంలో సర్వం కోల్పోయిన ఆటగాళ్లు అప్పుడప్పుడు పోలీసులకు సమాచారం అందిస్తున్నా చాలా తక్కువ మందే పోలీసులకు చిక్కుతున్నారు. ప్రతికూల వాతావరణంలో తప్ప నిత్యం జరిగే ఈ జూదక్రీడపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని భీమిలి ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం


ఊట చెరువు చుట్టూ తుప్పలు తొలగిస్తున్న అమనాం గ్రామస్తులు

తగరపువలస : పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా భీమిలి మండలం అమనాం పంచాయతీ యువత కొంత కాలంగా పని చేస్తున్నారు. ఆదివారం పంచాయతీకి చెందిన చుక్క ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఊటచెరువు చుట్టూ తుప్పలు, పేరుకుపోయిన చెత్తను తొలగించారు. సర్వే నంబర్ 71లో 4.43 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ ఇటీవల పూడిక పేరుకుపోవడంతో తొలగించారు. కార్యక్రమంలో దంతులూరి నరసింహ సత్యనారాయణరాజు, కంబపు శివకుమార్, బోర గురునాయుడు, చుక్క పోలయ్యరెడ్డి, మరగడ రఘురామరెడ్డి, మునకాల అనిల్‌కుమార్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా తీరం


రుషికొండ బీచ్‌లో పర్యాటకులు

కొమ్మాది : గత పది రోజుల నుంచి వర్షాల కారణంగా వెలవెలబోయిన పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం సందడిగా కనిపించాయి. వర్షం తగ్గుముఖం పట్టడంతో సాగర్‌నగర్, రుషికొండ, భీమిలి బీచ్‌తో పాటు తొట్లకొండ, బావికొండపై పర్యాటకుల సంఖ్య ఘణనీయంగా పెరిగింది.

ఐకమత్యంగా కళింగ సంఘం విస్తరణ


సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాయకులు

మధురవాడ : కళింగ సామిజక వర్గం సంక్షేమ భవనానికి ప్రభుత్వం విశాఖపట్నంలో 1000 గజాల స్థలం కేటాయించి, భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర కళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు పీసాన వెంకటరమణ డిమాండ్ చేశారు. జీవీఎంసీ 5వ వార్డు మధురవాడ చిలుకూరి గార్డెన్ సమీపంలో రాష్ట్ర కమిటీ సమావేశం రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ పీసా రామచంద్రరావు, రిటైర్డ్ విశాఖ ఫారెస్ట్ ఆఫీసర్ బి.రామనరేష్, రిటైర్డ్ వుడా చీఫ్ ఇంజినీర్ ఎం.అప్పన్న ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఐకమత్యంతో రాష్ట్ర కమిటీని, సంఘాన్ని విస్తరించాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదవారికి అండగా నిలవాలని నిర్ణయించారు. తమ సామాజిక వర్గానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. అనంతరం రాష్ట్ర నాయకులు కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో దుప్పల లక్ష్మణమూర్తి, బొడ్డేపల్లి రామారావు, నానుపాత్రుని సత్యనారాయణ, బెండి చిరంజీవి, ఎం.రామారావు, మధురవాడ కళింగ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది లక్ష్మణ, బుడుమూరి చంద్రశేఖరరావు, మొజ్జాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కంటి ప్రాధాన్యతను అందరూ గుర్తించాలి


సదస్సులో మాట్లాడుతున్న జోషి

మధురవాడ: సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్న మాటను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణులు బాలకృష్ణ సూచించారు. మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలో కంటి వైద్యంపై మధురవాడ డివిజన్ గ్రామీణ వైద్యులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్ఎంపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ కంటి వైద్యం చేయొద్దని సూచించారు. కన్నుకు కూడా గుండెలాగే ఒక్కోసారి అత్యవసర వైద్యం చేయాల్సి వస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కంటి చుక్కలు వేయొద్దన్నారు. ప్రజలు కూడా మందుల షాపులకు వెళ్లి కంటి చుక్కలు వేసుకోవడం పరిపాటిగా మారిందని, ఇది చాలా ప్రమాదకరమన్నారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగం జోషి, క్యాన్సర్ ఫౌండేషన్ కార్యదర్శి కోన ప్రకాశ్ మాట్లాడుతూ ఆర్ఎంపీలు క్రమశిక్షణతో వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కోశాధికారి పి.కనకారావు, మధురవాడ డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి జగదీష్, కిరణ్ పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

గోపాలపట్నం : యల్లపువానిపాలెంలో మైనర్ బాలిక ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడక గదిలో హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందింది. బాలిక యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. తల్లి వరలక్ష్మి ఎన్ఏడీలోని ఒక హోటల్లో పని చేస్తోంది. మధ్యాహ్నం వరకు అక్క, బావ ఇంట్లో ఉన్నారు. వారు బయటికి వెళ్లిన తర్వాత బాలిక ఉరి వేసుకుంది. వీరు మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి బెడ్ రూములో ఉరి వేసుకుని ఉండడం గమనించారు. దాంతో తలుపులు పగులగొట్టి బాలికను దించారు. అప్పటికే బాలిక మరణించినట్లు కుటుంబ సభ్యులు నిర్ధారించారు. బాలికకు కడుపునొప్పి ఉందని, దీని వల్లే మృతి చెంది ఉంటుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెపటైటిస్‌పై ఖైదీలకు అవగాహన

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో జైల్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణదేవి ఆధ్వర్యంలో ఆదివారం ఖైదీలకు హెపటైటిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖైదీలు హెపటైటిస్ పట్ల పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం లెప్రా సంస్థ ప్రతినిధి ఐ.శ్రీనివాసరావు హెపటైటిస్‌కు సంబంధించిన వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఖైదీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైల్ వైద్య సిబ్బంది, వార్డర్లు పాల్గొన్నారు.

'శ్రీమద్రామాయణం' వ్యాస సంపుటి ఆవిష్కరణ


గరికిపాటి నరసింహారావుకు పుస్తకాన్ని అందిస్తున్న ఆవిష్కర్త అప్పాజోస్యుల సత్యనారాయణ

సీతంపేట: వాల్మీకి రామాయణంలో రాముడు సాధారణ మానవుడని, విశ్వనాథ వారి రామాలయలో రాముడు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడని(విష్ణువు) ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సభలో 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము, ఉదాత్త కల్పనలు' వ్యాస సంపుటిని ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంపాదకులుగా, బాలకాండపై వ్యాసం రాయగా, ఐదుగురు గొప్ప సాహితీవేత్తలు అద్దంకి శ్రీనివాస్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు వెంకటేశ్వర్లు, కడిమిళ్ల వరప్రసాద్, పేరి రవి కుమార్ ఐదు కాండాలకు వ్యాసాలు రాయడం, అటువంటి గొప్ప వ్యాస సంపుటి ఆవిష్కరణకు అవకాశం కల్పించడం అంతా రాముని దయగా పేర్కొన్నారు. తొలి ప్రతిని విశ్వనాథ మనువడు విశ్వనాథ సత్యనారాయణకు అందజేశారు. సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన గరికిపాటి నరసింహారావుకు మరో ప్రతిని అందించారు. సభాధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ రామాయణంపై విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో వరుసగా మూడు కార్యక్రమాలు నిర్వహించే అవకాశం రాముని వల్లే లభించిందన్నారు. వినూత్న రీతిలో వ్యాసకర్తలే సమీక్షించడం విశేషమని పేర్కొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ మాట్లాడుతూ తాత గారు రాసిన మూల గ్రంథాలన్నీ అచ్చువేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విశ్వనాథ తండ్రి శోభనాద్రి ఆజ్ఞతో తాతగారు రామాయణం రాశారని తెలిపారు. చివరగా గరికిపాటి నరసింహారావు ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రయాగ సుబ్రహ్మణ్యం, తురగా కృష్ణకుమార్, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలి


ఆందోళన చేస్తున్న నాయకులు

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలని, ఇప్పటికే పిలిచిన టెండర్లను రద్దు చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ డిమాండ్ చేశారు. సీపీఎం స్టీల్‌సిటీ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి టోల్ ప్లాజా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలపరిమితితో పిలిచిన టెండర్లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. తెలుగుదేశం, కూటమి నాయకులు నెలరోజుల క్రితం టోల్‌గేటును ధ్వంసం చేసి ఎత్తివేశారని ప్రచారం చేసుకుంటున్నారని, అయితే వాస్తవంగా పద్ధతి ప్రకారం టెండర్లను నిలుపుదల చేసేలా కూటమి నాయకులు ప్రయత్నం చేయాలని కోరారు. తొలగించిన కొద్ది రోజులకే భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్‌హెచ్ఏఐ అధికారులకు అగనంపూడి టోల్‌గేటును కొనసాగించాలని ఆదేశించినట్టు తెలిసిందని, అదే వాస్తవమైతే టీడీపీ ద్వంద్వనీతి బయటపడుతుందని ఆరోపించారు. స్టీల్‌జోన్ కమిటీ నాయకులు పెదిరెడ్ల నీలకంఠం, ఉరివిటి మరిడయ్య, శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడారు.